# స్పేస్

అంతా డైనింగ్ టేబుల్ దగ్గర చేరాం. శ్రీమతి అన్నీ సర్ది, వడ్డించడం మొదలెట్టబోతోంది.

ఆదివారం లంచ్ టైం మాకెంతో అపురూపమైంది. ఎందుకంటే, కుటుంబ సభ్యులంతా కలసి కూర్చుని భోంచెయ్యడం, ఒక్క ఆదివారం లంచ్ టైంలోనే కుదురుతుంది. ఆఫీసు వున్న రోజుల్లో పొద్దుటే తొమ్మిదికల్లా ఇద్దరం ఎవరి బాక్సులు వాళ్ళు పట్టుకుని బయలుదేరతాం. పిల్లలు అంతకు ముందే బయలు దేరుతారు. ఇక రాత్రి భోజనమూ ఎవరికివారే... అబ్బాయి సాయం కళాశాలకెళ్ళి తిరిగొచ్చేసరికి తొమ్మిది దాటుతుంటుంది. అమ్మాయి కంప్యూటర్ క్లాసుకెళ్ళి తొమ్మిదికిగాని రాదు. ఆదివారం రాత్రి భోజనం కూడా పిల్లలు సినిమాలకీ, షికార్లకీ వెళ్ళి ఎప్పటికో ఇంటికి చేరుకుంటారు. అంచేత ఆదివారం లంచ్ టైంకి మాత్రం అందరం కలిసే భోంచెయ్యాలని ఒక నియమంగా పెట్టుకున్నాం.

పైగా ప్రతి ఆదివారం ఏదో స్పెషల్ ఉంటుంది. తరచూ ఏదో కొత్త వంట చేస్తుంటుంది శ్రీమతి.

"మీ అమ్మ కుకింగ్ ప్రయోగశాలలో మనం గినియా పిగ్స్మి!" అన్నా శ్రీమతిని ఆటపట్టిస్తూ.

"కొత్త వంటకాలు నచ్చితే మాత్రం కొడుకూ, కూతురు తండ్రి వాటిని తినడంలో 'వాటి'తోనే పోటీ పడతారు" అని షార్ప్‌గా రిటార్టిచ్చింది శ్రీమతి.

ఇంతలో కాలింగ్ బెల్ మోగింది. చిర్రెత్తుకొచ్చింది అందరికీ.

"ఏ దోమల మందో, సబ్బులో పట్టుకుని టైకట్టుకుని తయారైవుంటారు" సేల్స్‌మెన్‌ని ఊహించుకుంటూ విసురుగా వెళ్ళి తలుపు తీసింది శ్రీమతి.

ఎదురుగా 'సి' బ్లాక్ క్వార్టర్స్ ఫస్ట్‌ఫ్లోర్‌లో వుండే నారాయణ వాళ్ళ పాప అఖిల.

శ్రీమతి తీరు చూసి కొంచెం బెదిరినట్టుంది. వెంటనే మాటలు రాలేదు.

'ఏమిట'న్నట్టు చూసింది శ్రీమతి.

"ఆంటీ!... మేం అమ్మమ్మా వాళ్ళింటికి సెలవలకి వెళుతున్నాం... మా టెర్రస్ మీదున్న మొక్కల కుండీల్ని మేం వచ్చేవరకు మీ ఇంటి దగ్గర పెడతామని అమ్మ చెప్పమంది" అంది అఖిల బట్టీపట్టిన పాఠం అప్పచెప్పినట్టు.

కొంచెం టైంతీసుకుని, ఏదో తప్పదన్నట్టుగా "సరే" అంది శ్రీమతి వెనుదిరుగుతూ.

"వాళ్ళ బ్లాక్‌లో ఎవరితోనూ పడదు వీళ్ళమ్మకి. అందుకే మనింటిదాకా వచ్చారు" అంది శ్రీమతి వెటకారంగా.

"ఆ పాపకి వినిపిస్తుందేమో!" అన్నా కంగారుగా.

"ఉన్నమాటేగా!... వింటే వింది" అంటూ వచ్చి డైనింగ్ టేబుల్ ముందు ఓ కుర్చీలో కూర్చుని వడ్డించటం ఆరంభించింది.

మేం తినడమైతే పూర్తయ్యింది గాని నారాయణా వాళ్ళు మొక్కల కుండీలు తెచ్చిపెట్టలేదు.

శ్రీమతి వెటకారపు మాటలు ఆ పాప విన్లేదు కదా?...

ఆదివారం భోంచేసిన తర్వాత కాస్త కునుకు తీయడం అలవాటు నాకు. నాలుగు కావస్తుండగా మెలకువ వచ్చి, లేచి కిటికీలోంచి బయటికి చూడసాగాను.

నారాయణ కుటుంబం ఆటోలో బయలుదేరి వెళుతుండడం కనిపించింది.

హాల్లోకొచ్చి "వాళ్ళు మొక్కల కుండీలు తెచ్చి పెట్టారా?" అని అడిగాను శ్రీమతిని.

"లేదు" అంది.

"పోనీ టెర్రస్ మీదేగా వుండేది. పనిపిల్ల రామిని

ఎస్. హనుమంతరావు

పంపించి, తెప్పించకూడదూ... అసలే రోహిణీకార్తె నడుస్తోంది. వాళ్ళు వచ్చేసరికి నీళ్ళు లేక ఎండిపోతాయి'' అని అన్నాను.

''వాళ్ళకు లేని బాధ మనకెందుకు...'' అంటూ కొట్టిపారేసింది.

ఆ తర్వాత ఆ విషయం మరిచిపోయాను.

పదిహేను రోజుల తర్వాత ఓ సాయంత్రం ఆఫీసునుండి వస్తూ, క్వార్టర్స్ పక్కనుండి నడుస్తున్నా. నారాయణ వాళ్ళ క్వార్టర్స్ టెర్రస్ పై నుండి నిలబడి ఎవరో ఏదో విసురుతున్నట్టనిపించి, అనుకోకుండానే తలెత్తి చూశాను.

కుండీల్లోంచి తీసేసిన ఎండిపోయిన పూలమొక్కల్ని కిందికి విసురుతూ నారాయణ శ్రీమతి, పిల్లలూ...

నన్ను చూసి ఇంకా విసురుగా విసరడం మొదలెట్టింది ఆవిడ.

'మొక్కలు ఎండిపోవడానికి మీరే కారణం' అన్నట్టున్నాయి ఆవిడ వేడి చూపులు. నాకెందుకో గిల్టీగా అనిపించి, తలదించుకున్నా.

సమయం దొరికిందికదాని, ఆవిడ గొడవల స్వభావాన్ని ఎగతాళి చేసింది శ్రీమతి. ఆ విషయం బహుశా కూతురి ద్వారా తెలిసి, మొక్కలు ఎండిపోయినా ఫర్వాలేదంటూ వాటిని పంపకుండా ఊరుకుంది నారాయణ శ్రీమతి.

ఇద్దరి 'ఇగో'లు సంతృప్తి చెందాయి. మధ్యలో మొక్కలు మాత్రం చచ్చివూరుకున్నాయి. మొక్కలూ ప్రాణులేనన్న స్పృహ ఇద్దరికీ లేకపోయింది. ■

---

55 అప్పటికి ఆ మండువాలోగిలి ఎలా తయారయ్యిందంటే ముసలిది కుచ్చిళ్ళు సవరించి కొత్త చీర కట్టుకున్నట్టు, తలకు రంగువేస్తే లేని పడుచుదనం కనబడినట్లుగా తయారయ్యింది.

పెళ్ళాం మాట పుచ్చుకుని రామ్మూర్తి పెద్దన్నతో అన్నయ్యా మీకూ అమ్మని నీ పోర్షన్ సరిపోతుందనుకుంటే అందులోనే వుండు. నా పోర్షన్ అద్దెకిచ్చుకుంటానన్నాడు. మరోలా అనుకోకు.

మండల హెడ్ క్వార్టర్స్‌లో ఇల్లు కట్టి నేనూ అప్పుచేశాను అందుకు అడిగాను అంటూ అసలు విషయం చెప్పేశాడు.

రంగనాథం కాదనలేక అలాగే నీ ఇష్టం అని దాన్ని వెకేట్ చేశాడు. అంతా బాగున్నారనుకునేటంతలో నూకా రావు భార్యకి అతను తాహతుకుమించి అప్పులు చేసి నందువల్ల ఆస్తి సగం జప్తు చేయనున్నట్లు నోటీసు వచ్చిం దని ఎవరో చెప్పారు.

ఆమె నిద్ర మాత్రలు మింగేసింది. నూకారావు విషయం తెలిసి పట్నం తీస్కెళ్ళి పెద్ద ఆసు పత్రిలో ఐసియులో పెడితే బ్రతికింది. కాని కొత్తగా తల ఊపుడు రోగం పట్టుకుంది. అతని చేతి చమురు వైద్యానికిగాను అరవైవేలు వదిలిపోయింది.

చీకట్లో మోపెడ్‌మీద రామ్మూర్తి భార్య పొరుగూర్నించి ఇంటికొస్తూండగా లారీగుద్ది రక్తపుమడుగులో కొట్టుకుని చనిపోయింది.

ఆమె ఐడెంటిటీ చూసి పోలీసులు ఫోన్ చేస్తే భార్య సుకుమారి కోసం ఏక్సిడెంటు స్పాట్‌కెళ్ళాడు. పోలీసలు కేసు బుక్ చేశారు. పోస్ట్‌మార్టం చేసి డ్రైవర్ని అరెస్టు చేశారు.

అన్నదమ్ములు ముగ్గురూ రామ్మూర్తిని తీసుకుని స్వగ్రామం వచ్చేశారు. మరదలి శవాన్ని దహనం చేసి తమ్ముణ్ణి అక్కడే వుంచేసుకున్నారు. కొత్త ఇంటిని ఖాళీ చేయించి స్వంత పోర్షన్‌లోకి అతని సరంజామాను తెప్పించేశారు.

అతని పోర్షన్‌లో అద్దెకున్న వ్యక్తిని వెంటనే ఖాళీ చేయించేశారు. మండల కేంద్రంలో ఇల్లు అద్దెకిచ్చే ఏర్పాటు చేశాడు రామ్మూర్తి.

తమ్ముడికి తిరిగి పెళ్ళి చెయ్యాలనే ప్రయత్నం రంగనాథం ప్రారంభించాడు. ముందు వద్దన్నా అన్నగారే దూరపు సంబంధం చూసి అన్నవరం తీసెక్కళ్ళి గుళ్ళో పెళ్ళి చేసి రామ్మూర్తిని తిరిగి ఓ ఇంటివాణ్ణి చేయగలిగాడు.

నిజం చెప్పాలంటే నలుగురున్నందువల్ల ఆ మండువా లోగిట్లో ఒకరికొకరు సహకరించుకుని జీవితాల్ని ఆనందమయం చేసుకున్నారు.

ఇప్పుడు అటువంటి మండువాలోగిళ్ళ కన్నా అలా పెళ్ళాడేయడం అలా వేరుపడిపోవడం ఆ తర్వాత విడిపోవడం, లోగడ పెద్దలకు ఆలోచన వున్నందువల్ల ఇటువంటి మండువాలోగిళ్ళు కట్టారు. సుఖించారు.

అందుకే కలిసివుంటే కలదుసుఖం అన్నారు పెద్దలు. ఆలోచిస్తే కష్టానికీ సుఖానికీ నలుగురున్న మండువాలోగిలి ఆ ఊళ్ళో ఆదర్శప్రాయమై నిలబడింది. ■